క్లుప్తంగా

రక్తదాన శిబిరం నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై సీఐటీయూ ఆధ్వర్యంలో ఏడు ఏళ్లుగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా సెక్టార్–5 అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్న శిబిరాన్ని కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. రాధాకృష్ణన్ ప్రారంభిస్తారని యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి తెలిపారు. శిబిరంలో అంతా స్వచ్ఛందంగా పాల్గొవాలని కోరారు.

విద్యార్థి కేంద్రంగా బోధన సాగాలి



సమావేశంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

మల్కాపురం: ఉపన్యాస పద్ధతిలో కాకుండా విద్యార్థి ఆధారిత బోధనా పద్ధతులపై అధ్యాపకులు దృష్టి పెట్టాలని ప్రముఖ విద్యావేత్త యోగేష్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం నిర్వహించారు. ప్రస్తుత సమాచారం అనేక మార్గాల ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది...,అందువల్ల అధ్యాపకులు సమాచారం ఇవ్వడం పై కాకుండా విద్యార్థిని ఉత్తేజ పరిచే విధంగా దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు.చర్చలు,వాద- ప్రతివాదన, క్విజ్ , సెమినార్ల ద్వారా విద్యార్థులను తరగతిగదిలో క్రియాశీలకం చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పోక్స్ చట్టంపై ప్రసంగించారు.కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.


సోలార్ రూఫ్‌టాప్‌తో బహుళ ప్రయోజనాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవడం ద్వారా పలు ప్రయోజనాలను పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏడీఈ పార్థసారథి అన్నారు. స్థానిక చైతన్యనగర్‌లో శుక్రవారం నిర్వహించిన సోలార్ రూఫ్ టాప్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోదలచిన వినియోగదారులకు ప్రభుత్వం నేరుగా రూ.78 వేలు సబ్సిడీ అందిస్తోందన్నారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోవడం వల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లు పూర్తిగా ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె. స్టాలిన్, చినగంట్యాడ సబ్ స్టేషన్ ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రోడ్లు ధ్వంసం.. కాలువలు శిథిలం





శిథిలావస్థకు చేరిన మురుగు కాల్వలు

జీవీఎంసీ 92వ వార్డు పరిధిలోని నందమూరినగర్ వాసులు అసౌకర్యాల నడుమ అవస్థల జీవనం సాగిస్తున్నారు. ఏడాదిగా రోడ్లు, కాల్వల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. రహదారులు గోతుల మయంగా తయారవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వెళ్లాలంటే ఒళ్లు హూనమైపోతుందని వాపోతున్నారు. మురుగు కాల్వలు పలు వీధుల్లో శిథిలమయ్యాయి. దీంతో మురుగు నీరు వెళ్లే దారిలేక నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. ఇక పలు వీధుల్లో రోడ్లు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. మంచినీటి పైప్‌లైన్ పనుల కోసం తవ్వి వదిలేయడంతో ఇలా తయారయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రధాన రహదారిలో కాల్వ గోడ పూర్తి శిథిలమైంది. పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసేందుకు వీల్లేని విధంగా ఉన్నాయి. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు, కాలువలు నిర్మించాలని నందమూరి నగర్ వాసులు కోరుతున్నారు. – గోపాలపట్నం



మట్టి రోడ్డును తలపిస్తున్న సిమెంట్ రోడ్డు



నందమూరినగర్‌లో అధ్వానంగా మారిన రోడ్డు

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల కట్టడి



ఫ్రైడే-డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం ఫ్రైడే- డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, జిల్లా మలేరియా విభాగం హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డ్రైడే-ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయాలన్నారు. తద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలంతా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా విభాగం హెల్త్ టెక్నికల్ సూపర్‌వైజర్ భవాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, రమేష్, , మల్కాపురం మలేరియా నివారణ సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ సిబ్బంది, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

గాఢాంధకారం!



సింథియా -మల్కాపురం ప్రధాన రహదారిలో టార్చిలైట్ల వెలుగులో ప్రయాణిస్తున్న ప్రజలు



చీకటిమయంగా క్రాంతినగర్ నుంచి మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి

- టార్చిలైట్ల వెలుగులో ప్రయాణిస్తున్న వాహనచోదకులు, ప్రజలు
- చీకట్లో భయంతో పరుగులు తీస్తున్న మహిళలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ నుంచి ఇటు మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. క్రాంతినగర్‌లోనే కాకుండా సింథియా నుంచి మల్కాపురం వరకు ఉన్న ప్రధాన రహదారిలో సైతం వీధిలైట్లు వెలగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు టార్చిలైట్ల వెలుగుతో ప్రయాణిస్తున్నారు. నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కీటకాలు, పాములు సంచరిస్తాయనే భయంతో పాదచారులు చీకటిని అధిగమించే క్రమంలో పరుగులు తీస్తూ గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి పాలకులు, నాయకులు ప్రజాసమస్యలపై స్పందించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పైడిమాంబ జాతరకు ఏర్పాట్లు



పైడిమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 54,57వ వార్డుల పరిధిలోని ఐటీఐ జంక్షన్ దరి సంకురపేట గ్రామ ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి వార్షిక జాతరను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గ్రామ పెద్దలు పిల్లి మురళీరమణ, జుత్తుక రాము తదితరులు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 16న పైడిమాంబ తొలేళ్ల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఘటాల ఊరేగింపు, పుట్టబంగారం వద్ద పూజలు చేయనున్నారు. 17న అమ్మవారి ప్రధాన జాతర, 24న అమ్మవారి మారువారం జాతర, భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ పరిసరాలు, గాలి గోపురం సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక, నృత్య కార్యక్రమాల నిర్వహణకు వేదికలు సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు శంకర్, సూరిబాబు, అప్పలరాజు, రామకృష్ణ, కుమార్, పూజారులు పిల్లి వెంకటరెడ్డి పిల్లి నాగమణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొండి వైఖరి విడనాడాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి శంకరరావు

- లేకుంటే సమ్మెకు దిగుతాం
- ఆర్టీసీ కార్మికుల హెచ్చరిక

మల్కాపురం: ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం తన మొండి వైఖరిని విడనాడాలని,లేని పక్షంలో ఈ నెల 25వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని గాజువాక ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి పి.శంకరరావు హెచ్చరించారు. యాజమాన్యం తీరు వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం ఆర్టీసీ డిపో సమీపంలో నిర్వహించిన సమావేశంలో చర్చించారు. కార్మికులకు చట్ట వ్యతిరేక డ్యూటీలు రద్దు చేయాలని, అన్యాయంగా సస్పెండ్ చేసిన కార్మికుల సస్పెన్షన్ ఎత్తి వేయాలని,మహిళా ఉద్యోగులకు సరిపడే రెస్ట్‌రూమ్‌లు, లేటు అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన మహిళలకు ఓటీ డ్యూటీలకు బలవంతంగా పంపిచాలనే యాజమాన్యం చేస్తున్న యత్నం మంచిది కాదన్నారు. యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరి మార్చుకోవాలని కోరారు. ఇప్పటికే సమస్యలు పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టర్‌తో పాటు లేబర్ కమిషనర్‌కు వినతులను ఇచ్చినట్టు వెల్లడించారు. తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్మికులు,యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజీఆర్ఎఫ్‌కు మూడు ఫిర్యాదులు



సదస్సుకు హాజరైన ఈపీడీసీఎల్ అధికారులు, వినియోగదారులు



సదస్సులో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ సత్యనారాయణ

పెదగంట్యాడ: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ పెదగంట్యాడలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు మూడు ఫిర్యాదులు అందాయి. పెదగంట్యాడ రూరల్ మండలంలోని దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి లోవోల్టేజీ సమస్య వేదిస్తోందని వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. అలాగే బీసీ రోడ్డుకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉందని వెంటనే తొలగించాలని కోరారు. అలాగే కొంగపాలేనికి చెందిన ఓ వ్యక్తి కరెంటు బిల్లులు అత్యధికంగా వస్తున్నాయని విన్నవించారు. ఫిర్యాదులు అందుకున్న సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బి.సురేఖారాణి, ఎస్.సుబ్బారావు, ఎం.మురళీకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు, డీఈఈ మాధవి, ఏఈలు రాజేంద్రప్రసాద్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

‘అంబేడ్కర్ ఐడియాలజీ’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ తదితరులు

విశాఖ సిటీ: మోడ్రనైజింగ్ డాక్టర్ అంబేడ్కర్ ఐడియాలజీ పుస్తకాన్ని డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మెంబర్ సెక్రటరీ ప్రభాత్ కుమార్ సింగ్ సమక్షంలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ ఆవిష్కరించారు. నేటితరం యువతను అంబేడ్కర్ ఆలోచనలతో అనుసంధానం చేసే విధానాన్ని పుస్తకంలో వివరించినట్లు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్‌ల ప్రగతిని సమీక్షించడానికి శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ 2024–25లో చేపట్టిన కార్యక్రమాలు, అభివృద్ధితో పాటు 2025– 26 సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్ సభ్యులకు వివరించారు. ఏయూలో ఏర్పాటైన అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైవిధ్యమైన కార్యక్రమాలు, ప్రజలకు, యువతకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైవిధ్యమైన పరిశోధనలతో పాటు విభిన్న వర్గాలకు చేరువయ్యేలా అంబేడ్కర్ చైర్ నిర్వహించిన కార్యక్రమాలను అమిత్ యాదవ్ ప్రశంసించారు. యువతలో అంబేడ్కర్ ఆలోచనలను తీసుకెళ్లి వారిని ప్రభావితం చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏయూ అంబేడ్కర్ చైర్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమీక్షకు ఏయూ తరఫున ఆర్–డీ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి ప్రాతినిధ్యం వహించారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న కారు

గాజువాక: షీలానగర్ జాతీయ రహదారిపై ఓ కారులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కారు ఇంజిన్‌లో నుంచి పొగ వచ్చి ఒక్కసారిగా దట్టమైన మంటలు వ్యాపించాయి. కారులో ప్రయాణిస్తున్న తండ్రి, కుమార్తె ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు అందించిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా ఉమ్మలాడకు చెందిన ఎల్.ఎస్.వి.ప్రభాకర్ శనివారం తిరుపతి దర్శనం కోసం బయల్దేరాల్సి ఉంది. ఎన్ఏడీ కొత్తరోడ్‌లోని తమ బంధువుల ఇంట్లో ఉన్న కుమార్తెను తీసుకొని వెళ్లడం కోసం వచ్చిన ఆయన కుమార్తెతో కలిసి కారులో ఉమ్మలాడకు బయల్దేరారు. షీలానగర్ జంక్షన్‌కు వచ్చేసరికి కారు ఇంజిన్‌లోనుంచి పొగ రావడం గమనించారు. అప్రమత్తమైన ఆయన తనతోపాటు కుమార్తెను కారు లోనుంచి దించేశారు. క్షణాల్లోనే దట్టమైన మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆటోనగర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను ఆర్పివేశారు.

విశ్వబ్రాహ్మణులపై పాలకుల చిన్నచూపు



విశ్వబ్రాహ్మణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆంధ్ర రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతు రావు ఆరోపించారు. ఆ సంఘ కార్యవర్గ సమావేశం శుక్రవారం కూర్మన్నపాలెంలో నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సామాజిక వర్గాన్ని పట్టించుకోవడం లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు ఎంత మంది ఉన్నారన్న విషయం ప్రభుత్వాలకు తెలియాలంటే కులగణన చేయాలని తీర్మానం చేశారు. అలాగే సెప్టెంబర్ 17న అమరావతిలో యజ్ఞం నిర్వహించాలని నిర్ణయించారు. విశ్వబ్రాహ్మణులకు ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పాపయ్య, నరసింహాచారి, శ్రీనివాసరావు, కాకుమూరు వెంకటవేణు, అన్ని జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

● మీకిది తగునా?



శ్రీరామ్‌నగర్ గెడ్డలో వేసిన చెట్ల కొమ్మలు

ఫోకస్

ఇంజినీరింగ్ అధికారులు మీకిది తగునా..! అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానం అభివృద్ధి పనులు కొంత కాలంగా చేపడుతున్నారు. తొలుత ఇక్కడి చెట్లు తొలగించకుండా పనులు చేయాలని అనుకున్నా కుదరలేదు.దీంతో పలు చెట్లు తొలగించారు. అయితే ఈ చెట్ల కొమ్మలు మాత్రం శ్రీరామ్‌నగర్‌వైపు ఉన్న గెడ్డలో వేసేశారు. దీంతో మురుగు పారేందుకు ఆలటంకం కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు కాల్వల్లో వ్యర్థాలు వేయడం వల్లే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పే అధికారులే గొడ్డలో చెట్ల కొమ్మలు వేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. వాటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – గోపాలపట్నం

గంజాయి కలిగిన వ్యక్తికి జైలు, జరిమానా

విశాఖ లీగల్: గంజాయి కలిగిన వ్యక్తికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎన్‌వీ ప్రసాద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు తుమ్మల వెంకటేశ్వరరావు (45) వృత్తి రీత్యా వ్యాపారస్తుడు. నర్సీపట్నంలో నివాసం ఉంటున్నాడు. 2021 అక్టోబర్ 14న ఎక్సైజ్ పోలీసులు నర్సీపట్నం ప్రభుత్వ కళాశాల దగ్గర గంజాయి రవాణా జరుగుతుందన్న ముందస్తు సమాచారంతో నిఘా పెట్టారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో నిందితుడు 10 కేజీల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో నర్సీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తగా సింహాచలం

మద్దిలపాలెం: ఆంధ్రవిద్యాలయం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సమన్వయకర్తగా చిత్రకళ విభాగాధిపతి డి.సింహాచలం నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులను శుక్రవారం అందుకున్నారు.